



స్వర్ణ గ్రామాలే.. సంకల్పం

గ్రామ స్వరాజ్యం.. గాంధీ కల. స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబు ధ్యేయం.. ఈ రెండింటినీ మిళితం చేస్తూ స్వర్ణ గ్రామాల సంకల్పంతో గ్రామసభలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శుక్రవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎ.క్కడికక్కడ గ్రామసభలు జరగనున్నాయి. గుంటూరు జిల్లాలో 233, బాపట్ల జిల్లాలో 459, పల్నాడు జిల్లాలో 534 పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో ఏమేమి అభివృద్ధి పనులు అవసరం, ప్రజలు ఏమి కోరుకుంటున్నారు.. అనే అంశాలపై ఈ గ్రామసభల్లో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పంచాయతీలకు జవసత్వాలు అందించడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల నిధులు విడుదల చేయగా.. గత ప్రభుత్వంలో ఊసేలేని గ్రామసభలకు కూడా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసి రైతులకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకుని ఇందుకు సంబంధించి రైతుల ఆలోచనలతో ముందడుగు వేసేందుకు గ్రామ సభలనే వేదికగా ఎంచుకుంది.




- నేడు 1226 పంచాయతీల్లో గ్రామసభలు
- గ్రామసభల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు
- పల్లెల అభివృద్ధిపై ప్రతిపాదనల రూపకల్పన
- వ్యవసాయానికి దన్నుగా ఉపాధి హామీపై చర్చ
- సభలకు నోడల్ ఆఫీసర్‌గా మండల స్థాయి అధికారి

నరసరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్‌కి.. ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆ కార్యక్రమాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పుడు స్వర్ణ గ్రామాలు చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 1226 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఒక్క రోజే గ్రామసభల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆయా పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించడానికి అవసరమైనట్లుగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో గ్రామసభకు మండల స్థాయి అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యాలయాల్లో చేపడుతున్న గ్రామసభల ఉద్దేశాన్ని వివరిస్తూ గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారం చేశారు. పార్టీలకతీతంగా సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు ఈ సభల్లో భాగస్వామ్యం కానున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక గ్రామాలను వేధిస్తున్న ఎన్నో సమస్యలు గ్రామ సభల్లో చర్చకు రానున్నాయి. పంచాయతీ సర్పంచ్, సెక్రెటరి మొదలు ఎంపీడీవో, స్పెషలాఫీసర్లు, జిల్లా స్థాయి అధికారులు ఈ గ్రామసభలకు హాజరై ప్రజలతో మమేకమై చర్చిస్తారు. ఆ తర్వాత తీర్మానాలు చేసి ప్రతిపాదనలను జిల్లా నీటియాజమాన్య సంస్థ ద్వారా కలెక్టర్‌కు నివేదిస్తారు. కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి అవసరమైన లేబర్, మెటీరియల్ కాంపోనెంట్ నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటారు.

మొక్కుబడి తంతుగా కాకుండా..

గతంలో మొక్కుబడి తంతుగా నిర్వహించిన ఈ సభలను సంస్కరించి అత్యంత ప్రాధాన్యం గల అంశంగా మార్గదర్శకాలు మార్చి కూటమి ప్రభుత్వం తిరిగి తీసుకొచ్చింది. గ్రామసభలను మొక్కుబడితంతుగా కాకుండా పంచాయతీల పరిధిలోని సమస్యల పరిష్కార వేదికగా ఉండాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. సీసీరోడ్లు మొదలుకుని గత ప్రభుత్వంలో నిధుల వినియోగంలో జరిగిన అవకతవకల వరకు అన్ని అంశాలపైనా గ్రామసభల దృష్టిలో పెట్టొచ్చు. సభ దృష్టికి వచ్చిన సమస్య పరిష్కారంపై కూడా నిర్దిష్ట కాలపరిమితి విధించి జవాబుదారీతనం కల్పించే విధంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో చేపట్టే ప్రతిపని పురోగతి కూడా గ్రామసభల్లో చర్చకు రానుంది. కౌలు రైతులకు పెద్ద సంఖ్యలో జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డులు, మినీ గోకులాలు, సూక్ష్మసేద్యం విషయంలో పురోగతి, ఉద్యాన పంటలకు ఇటీవలే విడుదల చేసిన రాయితీలు, రాయితీ యంత్రాల విషయంలో నూతన మార్గదర్శకాలు తదితర అంశాలన్నీ గ్రామసభల్లో చర్చకు రానున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి హామీ నిధులు కూడా దారి మళ్లిన నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని నిర్ణయం తీసుకొన్నది. దీంతో శుక్రవారం జరిగే గ్రామసభల్లో అందరూ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని డ్వామా పీడీ ఉమాదేవి విజ్ఞప్తి చేశారు.



గుర్రపుడెక్క ఆకుతో నిండిన కాలువ

హద్దులు అంటూ లేకుండా పనులు

వ్యవసాయ అనుబంధ పనులను కూడా ఉపాధి హామీ కింద చేపట్టవచ్చు. కొత్త ఫీడర్ కాల్వలు, పంటకాల్వల తవ్వకం, పొలం గట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో సేద్యపు నీటి గుంటల నిర్మాణం, వ్యక్తిగత భూముల్లో భూమి అభివృద్ధి పనులు, సరిహద్దు కందకాలు, వ్యవసాయ బావుల నిర్మాణం, పండ్ల తోటల రింగు ట్రెంచ్‌ల నిర్మాణం, భూసార సంరక్షణ కందకాలు తవ్వడం, గడ్డి పెంపకం, పశువుల షెడ్లు, కోళ్ల ఫారాల నిర్మాణం, పట్టు పురుగుల షెడ్ల టైపు-1, 2, చెరువుల పునరుద్ధరణ, చెరువుల సరిహద్దు చుట్టూత కందకాలు తవ్వి మొక్కల పెంపకం, ప్రభుత్వ సంస్థల్లో సరిహద్దు కందకాల తవ్వకం, వ్యక్తిగత భూముల్లో పండ్ల తోటలు, పూలతోటలు, మల్బరీ తోటల పెంపకం, నర్సరీల ఏర్పాటు, గొర్రెల షెడ్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, మడ అడవుల పెంపకం, కాలువల్లో పూడిక తొలగింపు వంటి అనేక వ్యవసాయ పనులకు అనుమతి ఉన్నది. ఊట చెరువులు, పశువుల చెరువులు, వరద కట్టల నిర్మాణం, చెక్ డ్యాంల నిర్మాణం/మరమ్మతులు, బోర్‌వెల్ రీచార్జ్, కొండ దిగువ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు, రైల్వేలేన్ సరిహద్దు వెంట కందకాల తవ్వకం, చెరువులు/కుంటల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ గుంటల నిర్మాణం చేపట్టవచ్చు. అలానే మౌలిక సదుపాయాల కింద గ్రామ పంచాయతీల భవనాలు, వ్యవసాయ ఉత్పత్తి నిల్వ కేంద్రాలు, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రాలు, స్వయం సహాయ కేంద్రాలు, పాఠశాల ప్రహరీ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణం చేపట్టవచ్చు. సిమెంట్ రోడ్లు, డబ్ల్యూబీఎం, బీటీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఆటస్థలాలు, సామూహిక ఇంకుడు గుంతలు, శ్మశాన వాటికలు, ఆహార నిల్వ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను కూడా నిర్మించుకోవచ్చు. కాగా వ్యక్తిగత లబ్ధిచేకూర్చే పనులు కూడా ఉపాధిహామీ కింద చేసుకోవచ్చు. పొలంగట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో సేద్యపు నీటి గుంటల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్లు, గృహ నిర్మాణానికి 90 రోజుల పనిదినాల కల్పన వంటివి చేసుకునే వీలుంది. గ్రామసభల్లో ప్రజలు, రైతులు ఆయా పనులపై అభిప్రాయలను అందజేసి తద్వారా ఆయా పనులు చేసుకునే అవకాశం ఉంది.

ఉపాధితో.. అన్నదాతలకు అండ

గ్రామాలలో వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసందానం చేస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుందనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించకపోగా పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో పాటు ఉపాధి హామీ పథకం నిధులు కూడా పక్కదారి పట్టించే చర్యలకు పాల్పడింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పంచాయతీలకు జవసత్వాలు అందించడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసి రైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. పంచాయతీల్లో శుక్రవారం జరిగే గ్రామ సభలనే ఇందుకు వేదికగా ఎంచుకుంది. ఉపాధి హామీ పనుల విషయంలో ఇంతవరకు జరిగిన చెల్లింపులు, మెటీరియల్ అంశాలపై సభల్లో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవడానికి ప్రణాళిక రూపొందించారు. ఉపాధి హామీ వేతనదారులతో పాటు గ్రామాల్లో ఉన్న అన్నదాతలు పెద్ద ఎత్తున గ్రామ సభల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. ఉపాధి హామీ పనుల ద్వారా పొలాల్లో చేపట్టాల్సిన పనుల గురించి సభ ముందుకు తీసుకెళతారు. వీటిపై సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనుమతులు ఇస్తారు. ఇంతకు ముందు ఉపాధి నిధులతో చేపట్టే చెరువులు, కాల్వల పనులు, మొక్కల పెంపకం వంటి వాటిని యథావిధిగా కొనసాగిస్తూనే రైతులకు అండగా ఉండడానికి ఉపాధిహామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఎంత ఎక్కువగా పనిదినాలు కల్పించుకుంటే అంత ఎక్కువగా మెటీరియల్ కాంపొనెంట్ కింద నిధులు మంజూరు అవుతాయి.

సాగునీటి కాల్వలకు ప్రాధాన్యం దక్కేనా?

గుంటూరు, పల్నాడు జిల్లాలతో పాటు బాపట్ల జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా కాల్వల్లో పారే నీటి ద్వారానే జరుగుతుంది. అయితే ఈ సాగునీటి కాల్వలు ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. గుంటూరు చానల్ కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో కాల్వల ద్వారా సాగునీరు పొలాలకు సక్రమంగా అందక రైతులు అల్లాడుతున్నారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ నుంచి మూడు జిల్లాల్లో ప్రధాన కాల్వలన్నీ కూడా అధ్వానంగా ఉన్నాయి. తూటికాడ, పూడిక, పిచ్చిచెట్లు, నాచులతో కాల్వలో నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదు. కాల్వల బాగుకు నిధుల కొరత వెంటాడుతోంది. ఈ క్రమంలో ఉపాధితో గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టేందుకు సంకల్పించిన కూటమి ప్రభుత్వం సాగునీటి కాల్వల్లో పూడిక తీతకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులు సూచిస్తున్నారు. ఈ పనులు నిర్వహిస్తే సాగు నీటి సమస్యలను పరిష్కరించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. దారుణంగా ఉన్న సాగు నీటి కాల్వల అంశాన్ని రైతులు గ్రామసభల్లో ప్రస్తావించి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందించాలి.



టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినప్పటి దృశ్యాలు (ఫైల్)

టీడీపీ కార్యాలయంపై దాడి కేసు
దర్యాప్తు వేగవంతం

- 106 మందిలో ఇప్పటికే 21 మంది అరెస్టు.. 85 మందికి తాజాగా నోటీసులు
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్‌లతోపాటు ఓ న్యూస్ చానల్ రిపోర్టర్‌కూ..



మంగళగిరి, గుంటూరు, ఆగస్టు 22: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేసిన కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడిలో పాల్గొన్న నిందితుల్లో కొంత మందిని ఇప్పటికే అరెస్టు చేయగా, మిగతా వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. 2021 అక్టోబరు 19న జరిగిన ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులు క్రైం నెంబర్ 650/2021గా కేసు నమోదు చేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ కేసుపై దృష్టి సారించారు. ఐపీసీ 307 సెక్షన్‌తో పాటు మరికొన్ని సెక్షన్లను జోడించారు. ఐపీసీ 147,148, 452, 427, 323, 324, 506, 326, 307, 450, 380, రెడ్‌విత్ 109, 120బి, 149 తదితర సెక్షన్లతో కేసు నమోదైంది. ఈ క్రమంలో ఇప్పటివరకు మొత్తం 106 మందికి టీడీపీ కార్యాలయంపై దాడిలో ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. 21 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మిగతా 85 మందికి మంగళగిరి రూరల్ పోలీసులు ఈ నెల 19 నుంచి నోటీసులు జారీ చేశారు. వీరిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు, విజయవాడకు చెందిన వైసీపీ నేత దేవినేని అవినాష్, అరవ సత్యం వంటి ముఖ్య నేతలతోపాటు ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ కూడా ఉన్నాడు. అందుబాటులో లేని వారి ఇళ్లకు నోటీసులు అతికిస్తున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన కొందరు వైసీపీ నేతలు ఎన్నికల ముందు, తర్వాత టీడీపీలో చేరారు. అలాంటి వారిని ఉపేక్షించవద్దని టీడీపీ కార్యకర్తలు అనేక మార్లు అధినేత చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు పలుమార్లు ఫిర్యాదులు కూడా చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో స్పందిస్తూ చట్టాన్ని ధిక్కరించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం శిక్షించాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేసు నుంచి తప్పించుకోవడానికి టీడీపీలో చేరిన వైసీపీ నేతలపై కూడా చర్యలు ఉంటాయనేది స్పష్టమవుతోంది.

వైసీపీ కార్యాలయ ప్రతినిధులకు మళ్లీ నోటీసు..

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి ఆ రోజు వైసీపీ కార్యాలయంలోని సీసీ కెమెరాల పుటేజ్ ఇవ్వాలని కోరుతూ వైసీపీ కార్యాలయ సిబ్బందికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయా నోటీసులను వైసీపీ కార్యాలయ గోడకు అంటించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి వైసీపీ కార్యాలయం నుంచే పథకం రూపొందించడంతో పాటు కార్యాలయంపై దాడికి వచ్చే ముందు సూత్రధారులతో పాత్రధారులు వైసీపీ కార్యాలయంలో సమావేశమైనట్లు ఆరోపణలు వచ్చాయి.



మంగళగిరిలోని వైసీపీ కార్యాలయ గేటుకు పోలీసులు అంటించిన నోటీస్

ఈ నేపథ్యంలో దాడి జరిగిన రోజు వైసీపీ కార్యాలయం వద్ద ఉన్న సీసీ కెమెరా పుటేజ్‌లను పరిశీలిస్తే కుట్ర కోణం చేధించవచ్చని, ఈ కేసులో కీలక ఆధారాలు లభించే అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. దీనిలో భాగంగానే ఘటన జరిగిన రోజుకు సంబంధించి 24 గంటల సీసీ పుటేజ్ ఇవ్వాలంటూ వైసీపీ కార్యాలయ సిబ్బందికి ఈ నెల 13న సీఆర్‌పీసీ 160 ప్రకారం నోటీసు జారీ చేశారు. ఈ నెల 16న మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ఎదుట సీసీ పుటేజ్‌తో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే 16న వైసీపీ కార్యాలయ ప్రతినిధులు ఎవరూ హాజరు కాకపోవడంతో మరో సారి నోటీసు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.

తల్లి పేరుతో మొక్కలు నాటాలి

- కలెక్టరేట్‌లో మొక్క నాటిన అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 22: జిల్లాలోని ప్రజలందరూ తల్లి పేరుతో మొక్కలను నాటాలని కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. తన తల్లిపేరుతో కలెక్టరేట్‌లో గురువారం ఆయన ఓ మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతుందన్నారు. మానవ మనుగడ పర్యావరణంతో ముడిపడి ఉందన్నారు. కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ తన తల్లిపేరుతో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపినిచ్చారు.

వారాంతంలోగా పరిశీలన పూర్తి

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన దరఖాస్తుల పరిశీలన వారాంతంలోగా పూర్తి చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనపై గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సర్పంచులు, మున్సిపల్ కమిషనర్ల లాగిన్ల నుంచి రెండో దశ పరిశీలనకు అందిన 32,848 దరఖాస్తుల పరిశీలన శనివారంలోగా పూర్తి చేయాలన్నారు. మొదటి దశలో పెండింగులో ఉన్న మరో 12,952 దరఖాస్తుల పరిశీలనను ఎంపీడీవోలు, కమిషనర్ సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల ఇన్‌చార్జి అధికారి సుధాకర్, డీఆర్డీఏ పీడీ బాలునాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవ్‌రావు, జిల్లా వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకట్ రెడ్డి, ఎల్డీఎం రాంప్రసాద్, డీపీఆర్వో ఓం ప్రకాశ్‌రెడ్డి, విశ్వకర్మ రంగ నిపుణులు వెంకటేశ్వర్లు, జి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మొక్కలను నాటుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

5 శాతం వడ్డీతో రుణం

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ద్వారా సబ్సిడీలు అందిస్తామనే అపోహలపై కలెక్టర్ స్పష్టత ఇచ్చారు. విశ్వకర్మ యోజన ద్వారా ఎటువంటి సబ్సిడీలు అందించడం లేదన్నారు. అర్హులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, కేవలం 5 శాతం వడ్డీతో బ్యాంకుల ద్వారా మొదటి సారి రూ.1 లక్ష, రెండో సారి రూ.2 లక్షల వరకూ రుణం మంజూరు చేస్తామని తెలిపారు.

14 మంది సీఐలకు పోస్టింగ్స్

- ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ త్రిపాఠి

గుంటూరు, ఆగస్టు 22: గుంటూరు రేంజ్ పరిధిలో కొద్దిరోజులుగా జరుగుతున్న సీఐల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది దీనిలో భాగంగా గురువారం రేంజ్ పరిధిలో 14 మంది సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ
గన్నవరపు శ్రీనివాసరావు	ఒంగోలు పీటీసీ	ప్రత్తిపాడు
షేక్ నాగూర్‌మీరా షరీఫ్	ఇంటెలిజెన్స్	మేడికొండూరు
ఈ నారాయణ	ఇంటిలిజన్స్	గుంటూరు దిశ 1
బీ బ్రహ్మయ్య	రేంజి వీఆర్	సత్తెనపల్లి టౌన్
ఎం హైమారావు	రేంజి వీఆర్	నరసరావుపేట 2 టౌన్
బలగాని ప్రభాకరరావు	తుళ్లూరు ట్రాఫిక్	వినుకొండ రూరల్
ఆర్ సురేష్‌బాబు	నెల్లూరు ఎస్సీఎస్టీసెల్	రేపల్లె రూరల్
పీవీ ఆంజనేయులు	రేంజ్ వీఆర్	వేమూరు రూరల్
బీ నాగభూషణం	రేంజి వీఆర్	చీరాల 2 టౌన్
షేక్ ఖాజావలి	ఒంగోలు మహిళా పీఎస్	కనిగిరి
సీహెచ్ ప్రభాకర్‌రావు	రేంజి వీఆర్	యర్రగొండపాలెం
ఆర్ఎస్ కిశోర్‌కుమార్	మెరైన్	నెల్లూరు 5వ పట్టణం
ఓ పాపారావు	రేంజి వీఆర్	కావలి రూరల్
జే శ్రీనివాస్	రేంజ్ వీఆర్	గూడూరు 2 టౌన్

పిన్నెల్లి రూ.50 కోట్లు ఆస్తుల కబ్జా


- భయపెట్టి కాజేశారంటున్న మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ కుటుంబీకులు
- న్యాయం చేయాలని ముఖ్యమంత్రి, డీజీపీ, ఎస్పీలకు దుర్గాశ్రీనివాస్ లేఖ

గుంటూరు, ఆగస్టు 22: వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మరో వివాదం రాజుకుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయనతో పాటు, ఇతర వెసీపీ నాయకులు పలువురు అక్రమంగా తన ఆస్తులు కబ్జా చేశారని మాచర్ల మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ కృష్ణప్రసాద్ కుమారుడు దుర్గాశ్రీనివాస్ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. గతంలో పిన్నెల్లి, ఆయన అనుచరులు తన వ్యాపారాలను టార్గెట్ చేశారన్నారు. పెట్రోల్ బంకును ధ్వంసం చేసి, బంకు మూతపడేటట్లు చేశారని తెలిపారు. దీంతో తనకు ఆర్థికంగా భారీ నష్టం ఏర్పడిందని ఆ లేఖలో ఆరోపించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనను భయపెట్టి రూ.50 కోట్లు విలువ చేసే ఆస్తులను రూ.10 కోట్లకు అమ్మేలాగా బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకు న్నారని తెలిపారు. ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకం తీసుకుని పెట్రోల్ బంకును ఆక్రమించుకున్నారన్నారు. పిన్నెల్లి ఆక్రమంచిన ఆస్తులను తిరిగి తనకు ఇప్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. లేఖను ముఖ్యమంత్రితో పాటు డీజీపీకి, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి, పల్నాడు జిల్లా ఎస్పీకి పంపినట్లు శ్రీనివాస్ తెలిపారు.

పిన్నెల్లి బెయిల్‌పై నేడు నిర్ణయం



అమరావతి(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీప్యాట్‌ల ధ్వంసం, అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి, నాగశిరోమణి అనే మహిళను భూతులు తిట్టిన వ్యవహారంతోపాటు పోలింగ్ తర్వాతి రోజు కారంపూడి సీఐ నారాయణస్వామిపై దాడి చేసి గాయపరిచిన ఘటనలకు సంబంధించి నమోదైన కేసుల్లో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై ఇరువైపుల వాదనలు ముగియడంతో శుక్రవారం తీర్పు వెల్లడిస్తామని న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ప్రకటించారు. అంతకుముందు పిన్నెల్లి తరపున సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ గత 60 రోజులుగా జైల్లో ఉన్నారని, దర్యాప్తునకు సహకరిస్తామని, ఎలాంటి షరతులు విధించినా అభ్యంతరం లేదని తెలిపారు. అవసరమైతే కొంతకాలంపాటు పిటిషనర్ రాష్ట్రంలో అడుగుపెట్టరని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరపున ప్రత్యేక న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ వాదనలు వినిపిస్తూ.. మరికొంతమంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయాల్సి ఉందని, ఈ సమయంలో నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. కాగా, పిన్నెల్లి ప్రస్తుతం నెల్లూరు జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు ఇటీవల గురజాల కోర్టు నిరాకరించింది. దీంతో ఆయన బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.




బర్త్‌డే సర్‌ప్రైజ్!

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా 'విశ్వంభర' చిత్రంలోని ఆయన లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఒక రాతిపై కూర్చుని ప్రత్యేక శక్తులు కలిగిన త్రిశూలాన్ని పట్టుకుని ఉన్న మెగాస్టార్ పవర్‌ఫుల్‌గా అనిపించారు. ఆయన పుట్టినరోజున టీజర్ విడుదల ఉండదని దర్శకుడు వశిష్ఠ ముందే స్పష్టం చేయడంతో కొంత నిరాశ చెందిన మెగా అభిమానులను ఈ లుక్ సర్‌ప్రైజ్ చేసింది. 'చీకటి, చెడు ఈ ప్రపంచాన్ని ఆక్రమించినప్పుడు ఒక అద్భుతమైన తార పోరాడడానికి ప్రకాశిస్తుంది' అని చిత్రం టీమ్ ఈ పోస్టర్‌లో పేర్కొంది. 'విశ్వంభర' చిత్రం కోసం ఓ ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు. అద్భుతమైన డ్రామా, ఎమోషన్స్‌తో ఈ సినిమా విజువల్ వండర్‌గా ఉంటుందని నిర్మాతలు విక్రమ్, వంశీ, ప్రమోద్ చెప్పారు. అలాగే పుట్టినరోజు సందర్భంగా తండ్రితో దిగిన ప్రత్యేక ఫొటోను రామ్‌చరణ్ విడుదల చేశారు.

నచ్చితే ఎక్కడికైనా వెళతా..

"మనకు నచ్చిన వారి కోసం మనం తప్పకుండా నిలబడాలి. నాకు నచ్చినవారి కోసం ఎక్కడికైనా.. ఎంతదూరమైనా వెళతా.. ఏమైనా చేస్తా. ఈ మూవీ ఫంక్షన్ కోసం తబిత సుకుమార్ నన్ను పిలిచారు. అందుకే 'పుష్ప 2' క్లైమాక్స్ షూటింగ్‌లో ఉండి కూడా.. ఇక్కడికి వచ్చాను. 'మారుతీనగర్ సుబ్రమణ్యం' లాంటి సినిమాలు హిట్టవ్వాలి. ఇలాంటి మంచి కథలు ఉన్న చిత్రాలు మరిన్ని రావాలి అని కోరుకుంటున్నాను" అని అల్లు అర్జున్ అన్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రావురమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ, రమ్య పసుపులేటి ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సుకుమార్ చిత్రాన్ని సమర్పించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లు అర్జున్, సుకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమాను చూశాను. చాలా బాగుంది" అని చెప్పారు. "సినిమా అనుకున్నదానికంటే బాగా వచ్చింది. ఇది టీమ్ ఎఫర్ట్" అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు.





హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ ఒకటయ్యారు. కర్ణాటకలోని కూర్గ్‌లో బంధు మిత్రుల సమక్షంలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరిగింది. వీరిద్దరికీ తొలి చిత్రం అయిన 'రాజావారు రాణీగారు'లో నటించే సమయంలో ప్రేమలో పడ్డారు. మార్చి 13న వీరి నిశ్చితార్థం జరిగింది.

ఐటమ్ సాంగ్ చేస్తుందా?



నటి శోభితా ధూళిపాళకు ఇటీవలే నాగచైతన్యతో నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అమ్మడును ఓ క్రేజీ ఆఫర్ వచ్చి తలుపు తట్టింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్, కియారా అడ్వానీ జంటగా తెరకెక్కనున్న 'డాన్ 3'లో ఓ ప్రత్యేక గీతంలో నటించడానికి శోభితను మేకర్స్ సంప్రదించారట. దానికి శోభిత సమ్మతించారని కొందరు, అదేంకాదు ఇంకా చర్చల్లోనే ఉందని మరికొందరు అంటున్నారు. మరి శోభిత నిజంగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా.. లేదా అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఆమె నిర్ణయం కోసం ఆ చిత్ర దర్శక నిర్మాతలే కాదు, అక్కినేని అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొత్త ఇంట్లో నరేశ్

సీనియర్ నటుడు నరేశ్ ఓ ఇంటి వాడయ్యారు. చిలుకూరి బాలాజీ ఆలయానికి సమీపంలో ఆయనకు ఓ వ్యవసాయ క్షేత్రం ఉంది. అందులో ఓ పెద్ద ఇల్లుని అత్యాధునిక వసతులతో నిర్మించి ఇటీవలే గృహ ప్రవేశం చేశారు. ఈ భవంతికి విజయకృష్ణ మందిరం అని పేరు పెట్టారు. ఇక్కడే హీరో కృష్ణ, ఇందిరా దేవి విగ్రహాలతో ఏర్పాటు చేసిన ఇందిరా దేవి స్ఫూర్తి వనాన్ని కూడా ఆ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన చిత్ర ప్రముఖులకు నరేశ్, పవిత్ర స్వాగతం పలికారు. నరేశ్ కొత్త ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






ఇన్ ప్రోగ్రెస్

చిన్నా ఇది వింత లోకం!



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ కీలక పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ సినిమా తీస్తున్నారు. నందకిశోర్ ఈమని దర్శకుడు. ఈ చిత్రం నుంచి భరద్వాజ్ గాలి రాసిన 'చిన్నా.. ఇది వింత లోకం' పాటను విడుదల చేశారు. స్కూల్ ఎపిసోడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

గరుడ పురాణం ఏం చెబుతోంది?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా నటిస్తున్న తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కే.ఎస్.నందీశ్ దర్శకత్వంలో విజయ్‌లోహిత్ నిర్మిస్తున్నారు. ఇటీవలే సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నందీశ్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. ఇదో వైవిధ్యభరితమైన సినిమా" అని అన్నారు. "మంచి కథతో తెరకెక్కుతోన్న ఈ సినిమా అందరికీ మంచి ఫీల్ గుడ్ మూవీ చూశామనే అనుభూతిని ఇస్తుంది" అని నిర్మాత విజయ్‌లోహిత్ చెప్పారు.

బయట ప్రపంచం చాలా చెత్తగా ఉంది



'ఏ మహిళ అయినా ఎవరితోనూ తన ఇబ్బందిని చెప్పుకొనే ధైర్యం చేయలేదని అనిపిస్తేనే ఆమెను మరింత ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారికి నో చెప్పడం నేర్చుకోవాలి' అన్నారు మంచు లక్ష్మి. చిత్ర పరిశ్రమలో మహిళా ఆర్టిస్టులను వెంటాడి వేధిస్తున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'అన్యాయం జరిగిన వెంటనే బయటకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఉంది. అలాగే ఆర్టిస్టులు తెలివిగా నో చెప్పడం నేర్చుకోవాలి. కెరీర్ మొదలు పెట్టిన సమయంలో నన్నూ కొందరు ఇబ్బంది పెట్టారు. వారిపై గట్టిగా అరిచి నాకు వచ్చిన ఛాన్స్ పోగొట్టుకున్నా. కానీ తర్వాత అలాంటి విషయాల్లో తెలివిగా వ్యవహరించడం నేర్చుకున్నా. అప్పటికీ అవతలి వారు విసిగిస్తుంటే మనం వారికి బుద్ధి చెప్పక తప్పదు. ఎందుకంటే బయటి ప్రపంచం చాలా చెత్తగా ఉంది' అన్నారామె.



వర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న లీగల్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు, ఆచార్యులు

మహిళల రక్షణకు చర్యలు చేపట్టాలి

- కోల్‌కత్తా ఘటనను ఖండిస్తూ ఏఎన్‌యూలో విద్యార్థినుల నిరసన
- వర్సిటీలో మహిళా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని వినతి

పెదకాకాని,ఆగస్టు 22: విద్యార్థినులు, మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తా నగరంలో ఆర్జీకర్ ప్రభుత్వాస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన దారుణ ఘటనను ఖండిస్తూ గురువారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఆయావిభాగాల ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థినీ, విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ అన్ని విభాగాలు మీదుగా వర్సిటీ ప్రధాన గేటులోని ఆచార్య నాగార్జున విగ్రహంవరకు కొనసాగింది. అనంతరం వర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధరరావును కలిసి పలు డిమాండ్లపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎల్ఎల్ఎం క్రైమ్ బ్రాంచ్ విద్యార్థిని తన్మయ్ మాట్లాడుతూ వర్సిటీలో విద్యార్థినుల సమస్యల పరిష్కారం కోసం సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ (ఎస్‌పీవోసీ), తో పాటుగా ఉమన్ గ్రీవెన్స్‌సెల్‌ని ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి వీసీని కోరారు. దీనిపై ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంపై విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. జయశ్రీని పరిశీలించమని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎల్. జయశ్రీ, డాక్టర్ ఎస్.సతీష్, డాక్టర్ పీ.వెంకట్‌రమణ, డాక్టర్ జీ.వైఎస్. కిషోర్‌కుమార్, ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఎన్.రాధిక, డాక్టర్ సీహెచ్. సురేష్, డాక్టర్ శివరాం, చిన్నారావు, డాక్టర్ సతీష్ ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 8004 క్యూసెక్కులు

దుగ్గిరాల,ఆగస్టు22: విజయవాడ ప్రకాశంబ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు గురువారం 8004 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 14,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 340 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1861 , తూర్పుకాల్వకు 761, పశ్చిమకాల్వకు 250, నిజాంపట్నంకాల్వకు 490, కొమ్మమూరు కాల్వకు 3120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వైద్యుల రక్షణకు ఉన్నత స్థాయి కమిటీ

- రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేసేందుకు చర్యలు
- జూడాలకు జీజీహెచ్ సూపరింటెండెంట్ హామీ
- వివిధ అంశాలపై వారితో చర్చలు


జూడాలతో చర్చలు జరుపుతున్న సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

గుంటూరు (మెడికల్) ఆగస్టు 22: ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో జూనియర్ డాక్టర్ల రక్షణకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. కోల్‌కతాలో మెడికల్ పీజీ విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో నింధితులను కఠినంగా శిక్షించాలని, విధి నిర్వహణలో వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12 నుంచి జీజీహెచ్‌కు చెందిన జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించి, నిరవధికంగా నిరసన చేపట్టిన విషయంతెలిసిందే. గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ నిరసన శిబిరాన్ని సందర్శించి జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపారు. విధుల్లో ఉండే వైద్యులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. అదనంగా మరో 100 మంది ప్రైవేటు సెక్యూరిటీని నియమించాలని డీఎంఈకి ప్రతిపాదనలు పంపతున్నట్లు తెలిపారు. రోగుల సహాయకులు ఎక్కువ మంది ఆస్పత్రిలోకి రాకుండా కట్టడిచర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆస్పత్రిలో పోలీసు పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. జీజీహెచ్ పోలీస్ అవుట్ పోస్టులో పోలీసులు సంఖ్యను పెంచాలని ఎస్పీని కోరినట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. అవుట్ పోస్ట్ పోలీసులు యూనిఫాంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

జీజీహెచ్ చుట్టూ హోటళ్లు, ఆటోస్టాండ్ తొలగిస్తాం...

ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు తమ సమస్యను అధికారుల దృష్టికి తెచ్చారు. రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. వైద్యులపై దాడులు జరిగితే నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉండే వైద్యులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వీటిపై డాక్టర్ కిరణ్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా ప్రభుత్వాస్పత్రి ప్రహరీ చుట్టు ఉన్న వ్యాపారాలు, ఆటోస్టాండ్‌ను తక్షణం తొలగించాలని జీఎంసీ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు జూడాలు తమ నిరసన కొనసాగించారు. పలు వార్డులకు వెళ్లి.. తాము ఎందుకు ఆందోళన కార్యక్రమాలు చేస్తోందీ రోగులకు, వారి సహాయకులకు వివరించి తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.


వార్డులో ప్రచారం చేస్తున్న జూనియర్ డాక్టర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

ఎసెన్షియా కర్మాగారం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

వినుకొండ టౌన్ ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం ఫార్మా సెజ్ ఎసెన్షియా కర్మాగారంలో జరిగిన దుర్ఘటనలో బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎసెన్షియా ఫార్మాకంపెనీలో వరుస సంఘటనలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా దేశంలో మహిళలు, బాలికలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, ఇటువంటి ఘటనల్లో నిందితులకు వెంటనే శిక్షపడేలా చట్టాలు ఉండాలన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి 9 వారాలు అయిందని, ప్రభుత్వాలు ఏవైనా సీపీఐ ఎప్పుడూ ప్రజల పక్షమే నన్నారు. వినుకొండలో బ్రహ్మనాయుడు మాత్రం నీచరాజకీయాలు పాల్పడ్డారని అన్నారు. సమావేశంలో మారుతీ వరప్రసాద్, సంద్రపాటి సైదా, శ్రీనివాసరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 22: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7978 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,597, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం అవుట్ ఫ్లో 48,255 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 34,745 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.


1.01 ఎంయూల విద్యుదుత్పత్తి

- పులిచింతలకు 27023 క్యూసెక్కులు విడుదల

రెంటచింతల, ఆగస్టు 22: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా బుధవారం అర్ధరాత్రి 12గంటలవరకు 1.01 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కే.వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు గేట్లను మీటర్నర మేర ఎత్తి 18574, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8449 మొత్తం 27023 క్యూసెక్కులు నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్ నుంచి 27 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7.02 టీఎంసీలు ఉండగా, అది 75.42 మీటర్లకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 22 : అచ్చంపేట, ఆగస్టు 22 : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 28,874 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 33,624 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.


ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు


బ్యారేజి దిగువకు 14,600 క్యూసెక్కులు

- డెల్టా కాలువలకు 17, 644 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 32,244 క్యూసెక్కులు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ ఒక ప్రటనలో పేర్కొన్నారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 1 అడుగు ఎత్తి దిగువకు 14,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17,644 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు..


రామ్‌చరణ్ మృతదేహం

దాచేపల్లి, ఆగస్టు 22: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన గురువారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని భవ్య సిమెంట్ పెట్రోలు బంక్ సమీపంలో జరిగింది. పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కోంద్రు రామ్‌చరణ్ (17), అతని స్నేహితులు బీసపోగు ఉదయ్‌కుమార్, గింజమూరి చిన వెంకయ్యలు ద్విచక్రవాహనంపై దాచేపల్లి వైపు వస్తున్నారు. వేగంగా ప్రయాణిస్తున్న వారి ద్విచక్ర వాహనం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని భవ్య సిమెంట్ పెట్రోలు బంక్ వద్ద ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితులు ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని దాచేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మృతుడు రామ్‌చరణ్ 10వ తరగతి వరకు చదివి కూలీపనులకు వెళ్తున్నాడు. మృతునికి తండ్రి కోటయ్య, తల్లి కోటేశ్వరి, 7వ తరగతి చదువుతున్న తమ్ముడు వున్నారు. దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తాత,మనవడు మృతి

తుళ్లూరు, ఆగస్టు 22: రోడ్డు ప్రమాదంలో తాత, మనవడు మృతి చెందిన ఘనట బుధవారం రాత్రి జరిగింది. తుళ్లూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన గంగోలు దోర్నేష్ ఆయన మనవడు గంగోలు అవినాశ్(13) టీవీఎస్ మోపెడ్‌పై దొండపాడులో జరిగే ఒక కార్యక్రమానికి వస్తున్నారు. అమరావతి వైపు వెళ్లే కారు మోపెడ్‌ను హరిశ్చంద్రపురం వద్ద ఢీ కొట్టగా దోర్నేష్ అక్కడకక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అవినాశ్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బాలుడు అవినాష్ ఆస్పత్రిలోనే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు పోలీసులు గురువారం తెలిపారు.


రాజీనామా పత్రాన్ని అందిస్తున్న నరసింహారావు

వైసీపీకి మాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్

పోలూరి నరసింహారావు రాజీనామా

మాచర్లటౌన్, ఆగస్టు 22: మాచర్ల మున్సిపల్‌వైస్ చైర్మన్, వైసీపీ నేత పోలూరి నరసింహారావు గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని వైసీపీ పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావుకు అందజేశారు. అనివార్య కారణాలతో తాను వైసీపీకి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. కాగా శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో మున్సిపల్ చైర్మన్‌గా పోలూరి నరసింహారావు బాధ్యతలు చేపట్టనున్నారు.


ఆడిట్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్నరాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

సీజీఎస్‌టీ ఆడిట్ రాష్ట్ర కార్యాలయాన్ని గుంటూరుకు తీసుకురావాలి

- రాష్ట్ర కమిషనర్‌కు సీబీజీసీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి

గుంటూరు, ఆగస్టు 22: కేంద్రప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం విశాఖప ట్నంలో ఉన్న సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనరేట్ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని గుంటూరుకు తరలించాలని ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్‌శాఖకు చెందిన రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు సెంట్రల్ జీఎస్టీ రాష్ట్ర ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్‌ను గుంటూరు కాకాని రోడ్డులోని సీజీఎస్టీ ఆడిట్ సర్కిల్ కార్యాలయంలో గురువారం పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందచేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.వివేకానంద, గద్దె తిలక్‌లు మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా ఉన్న సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ కార్యాలయం అమరావతికి, విశాఖ ఆడిట్ కమిషనరేట్ కార్యాలయం గుంటూరులో ఏర్పాటు చేయాలని పది సంవత్సరాల క్రితమే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కానీ అప్పటి నుంచి ఇప్పటివరకు కూడా ఎలాంటి మార్పు జరగలేదన్నారు. శాఖా పరంగా ఢిల్లీ నుంచి జారీ అవుతున్న అధికారుల బదిలీ ఉత్తర్వుల్లో కూడా ఆడిట్ పోస్టింగ్స్ విషయంలో విశాఖ ఆడిట్ అని కాకుండా గుంటూరు ఆడిట్ అనే పేర్కొంటున్నారన్నారు. కానీ ఇక్కడ పరిస్థితి ఢిల్లీ అధికారులకు తెలియటంలేదన్నారు. సెంట్రల్ జీఎస్టీ రాష్ట్ర ఆడిట్ కమిషనర్‌గా నూతనంగా నియమితులైన పి.ఆనంద్ కుమార్ ఈ విషయంలో చొరవ తీసుకొని ఆడిట్ హెడ్ క్వార్టర్స్‌ను విశాఖ నుంచి గుంటూరుకు తక్షణమే తరలించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘనాయకులు పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00


గుంటూరు ఛానల్‌ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు ఛానల్‌కి రూ.626 కోట్లు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వెల్లడి
- రైతులతో కలసి గారపాడు వద్ద కాలువ పరిశీలన

వట్టిచెరుకూరు, ఆగస్టు 22: గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనులకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ. 626 కోట్లు మంజూరు చేస్తుందని, ఈ విషయాన్ని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆయన వట్టిచెరుకూరు మండలం గారపాడులో స్థానిక రైతులతో కలసి గుంటూరు ఛానల్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఛానల్ మరమ్మతులకు నోచుకోక పోవడంతో నీరు రావడం లేదని, దీంతో పైరులు ఎండిపోతున్నాయని, తక్షణమే కాల్వలో పూడికను తొలగించాలని, కాలువను వెడల్పు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు గుంటూరు చానల్ పొడిగింపు, మరమ్మతుల నిర్వహణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీని నెరవే ర్చేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని అన్నారు.

ఐరోపా పర్వతంపై తాడేపల్లి మహిళ

- 18,510 అడుగుల ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి సంచలనం


ఎల్బ్రస్ పర్వతంపై బండారు అన్నపూర్ణ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22: బాలికలు కొండలు ఎక్కడంపై సమాజంలో నెలకొన్న వివక్ష కారణంగా బాల్యంలో మిన్నకుండిపోయిన ఓ మహిళ తన పట్టుదలతో నేరుగా ఐరోపా ఖండంలోనే అతి పెద్దపర్వతాన్ని అధిరోహించి సంచలనం సృష్టించింది. గుంటూరుజిల్లా తాడేపల్లికి చెందిన బండారు అన్న పూర్ణ బాల్యంలో తాడేపల్లి కొండలపై ఎక్కుతుండగా అనేక విమర్శలను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ అంచలమైన విశ్వాసంతో ఇప్పుడు ఐరోపా ఖండంలోని అతిపెద్ద పర్వతమైన ఎల్బ్రస్ పర్వతాన్ని అలవోకగా అధిరోహించి అందరి ప్రశంసలు పొందుతున్నారు. 18,510 అడుగుల ఎత్తులోవున్న రష్యాలోని ఈ పర్వతాన్ని సోమవారం అధిరోహించిన అన్నపూర్ణ సౌదీకి తిరుగు ప్రయాణమయ్యారు. గల్ఫ్‌దేశాలలో పాఠశాలలకు సెలవులు కావడంతో ఎల్బ్రస్ పర్వతారోహణకు బయలుదేరిన ఆమె తన సంకల్పాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారు. తన బాల్యంలో తాడేపల్లి కొండలపైకి ఎక్కడం తనకుఆసక్తిగా వున్నప్పటికీ... పర్వతారోహణ చేయడాన్ని అప్పట్లో ఎవ్వరూ స్వాగతించలేదని, దీంతో తాను తన ప్రయత్నాలను విరమించుకున్నానని అన్నపూర్ణ తెలిపారు. కానీ, తనకు మహేశ్‌రెడ్డితో వివాహమైన తర్వాత సమీప కొండలన్నీ ఎక్కానని గుర్తుచేసుకున్నారు. తొలిసారిగా 12,500 ఎత్తులో వున్న హిమాలయ పర్వతాలలోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉత్తర కాశీ జిల్లా కేదరకంఠ పర్వతాన్ని 2022లో అధిరోహించానని చెప్పారు. గతేడాది ఆఫ్రికాలోని ఎత్తయిన టాంజానియా లోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలైన అన్నపూర్ణ బాలికలు వ్యాయామ విద్యలో మరింత రాటుదేలాలని అభిప్రాయ పడ్డారు. గల్ఫ్ దేశాల నుంచి ఒక తెలుగు మహిళ ఐరోపాలోని ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించడం పట్ల సౌదీ అరేబియాలోని తెలుగు ప్రవాసీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

31న ఏపీ స్టేట్ పికిల్‌బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 22: ఏపీ స్టేట్ పికిల్ బాల్ అసోసియేషన్, వీవీవీ హెల్త్‌హబ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి రెండు రోజుల పాటు తొలి ఏపీ స్టేట్ పికిల్ బాల్ ఛాంపియన్‌షిప్ బాలుర పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహక కార్యదర్శి టీ.అరుణ్ కుమార్ తెలిపారు. గుంటూరు, హనుమాన్ నగర్ 1వ లైన్‌లోని వీవీవీ హెల్త్ హబ్ లోని పికిల్‌బాల్ కోర్టులో పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురువారం పోటీల పోస్టర్లును నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అండర్ -14, 19 సింగిల్స్ తోపాటు 35 ప్లస్, 50 ప్లస్ పురుషులు, డబుల్స్ ఓపెన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగు తాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎన్.శ్రీధర్, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాదు, ఆనంద్‌కుమార్, నాగరాజు, బాలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ జలీల్ తదితరులు

24,25 తేదీల్లో రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు

చిలకలూరిపేట, ఆగస్టు 22 : పల్నాడు జిల్లా చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో ఈనెల 24, 25 తేదీల్లో ఏపీ స్టేట్ క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి శ్రీగిరిరాజు కృష్ణమూర్తి స్మారక సెకెండ్ ర్యాంకింగ్ క్యారమ్స్ పోటీలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర క్యారమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ గురువారం తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి పలువురు ఉద్యోగులతో పాటు జాతీయస్థాయి క్రీడాకారులైన జనార్దన రెడ్డి, వైఎస్‌డీ రమేష్, ఎంఎస్‌కే హారిక, ఎస్‌కే హస్నా సమీర తదితరులు పాల్గొంటున్నట్టు వివరించారు. చీఫ్ రఫరీగా డీఎస్ఆర్ మూర్తి, అసిస్టెంట్ రిఫరీగా సిరాజ్ అహమ్మద్‌లతో పాటు మరో 8 మంది రిఫరీలు ఉంటారని, అబ్జర్వర్‌గా జే మురళీకృష్ణ వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో పల్నాడు జిల్లా క్యారమ్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లగుండ్ల అజయ్ బాబు, బోయపాటి రవితేజ, సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, నిర్వాహక కార్యదర్శి ఎస్‌వీ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

57,271 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 52,263 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 57,271 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 19,564 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	16500	334	8500	15000
నెంబరు. 5	9000	15800	నెంబరు. 5	10500	13000
273	10500	16500	273	10000	12500
341	8500	15000	341	9000	16000
4884	11500	12700	4884	14500	15500
సూపర్ 10	--	--	సూపర్ 10	10500	10500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18700	తేజ	8000	18800
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	8800	16500
దేవనూరు డీలక్స్	8500	13000	దేవనూరు డీలక్స్	8500	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	6000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

జిల్లా వ్యాప్తంగా నేడు గ్రామ సభలు

దాచేపల్లి, ఆగస్టు 22: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024-25 ఆర్థిక సంవత్సరంలో నూతన పనులను గుర్తించి మంజూరు నిమిత్తం ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శోభారాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేసే పనులను గుర్తించి వాటిపై చర్చించేందుకు ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ప్రత్యేక అధికారులను నియమించారు. భట్రుపాలెంకు అగ్రికల్చర్ అధికారి శ్రీలక్ష్మి, గామాలపాడుకు వ్యవసాయశాఖ ఏవో పాపకుమారి, కాట్రపాడుకు పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసనాయక్, కేశానుపల్లికి ఐసీడీఎస్ అధికారి అరుణ, కొత్తూరుకు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ సాంబశివరావు, మాదినపాడుకు హౌసింగ్ ఏఈ బంగారయ్య, ముత్యాలంపాడుకు ఎంపీడీవో శోభారాణి, పెదగార్లపాడుకు ఎంఈవో పినాకపాణి, పొందుగలకు తహసీల్దార్ కుటుంబరావు, రామాపురంకు ఎన్ఆర్ఈజీఎస్ పీఏ రేఖ, సారంగపల్లి అగ్రహారంకు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సోమయ్య, శ్రీనగర్‌కు ఐసీడీఎస్ అధికారి వరలక్ష్మీ, తక్కెళ్లపాడుకు వెలుగు ఏపీఎం మంత్రూనాయక్, తంగెడకు ఏపీవో మల్లికార్జునరావులు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించి గ్రామసభలు నిర్వహిస్తారు.

గురజాలటౌన్ : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఒక్కరోజే గ్రామసభలు నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ తెలిపారు గ్రామ సభల్లో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు జరుగనున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో పాటు ప్రతి గ్రామంలో వీధిలైట్లు, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు, రోడ్లు, పారిశుధ్యం మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వీటి ఆమోదం కోసం గ్రామ స్థాయిలో గ్రామాభివృద్ధికి చేయాల్సిన పనులను ఆమోదింపజే సేందుకు అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించనున్నారు.

సత్తెనపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న గ్రామ సభలను సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పంచాయతీల్లో విజయవంతం చేయాలని ఆర్డీవో మురళీకృష్ణ గురువారం అధికారులను ఆదేశించారు. గ్రామ సభల్లో ఆయా మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామ సభల్లో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. గ్రామ సభలకు అధికారులతో పాటు సామాజిక బాధ్యత వహించే ప్రతి ఒక్కరిని కూడా భాగస్వాములను చేయాలన్నారు.



ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో విస్తృతంగా ఫీవర్ సర్వే

గురజాలటౌన్, ఆగస్టు 22: మండలంలోని మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ ఆధ్వర్యాన గురువారం మండల పరిధిలోని గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ తమ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. జ్వరాలు తీవ్రత ఎక్కువగా వున్న నేపథ్యంలో గ్రామస్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఫార్మా సెజ్‌లో ప్రమాదం దురదృష్టకరం

పెదకూరపాడు, ఆగస్టు 22 : ఫార్మా సెజ్‌లో ప్రమాదం జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోవటం దురదృష్టకరమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన తెలిపారు.



రెంటాల జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులుతో చర్చిస్తున్న డిప్యూటీ ఈవో ఏసుబాబు

ఎమ్మెల్యే వినతికి స్పందించిన మంత్రి లోకేశ్

● రెంటాల జడ్పీ పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారుల తనిఖీ

రెంటచింతల,ఆగస్టు 22 :మండలంలోని రెంటాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఈనెల 20న విద్యామంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. వెంటనే స్పందించిన లోకేశ్ పాఠశాల స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ పి.అరుణబాబును ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సత్తెనపల్లి డిప్యూటీ ఈవో ఏసుబాబుతో పాటు ఎంఈవో శివనాగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాఠశాలను సందర్శించారు. 6,7 తరగతులను ఎలిమెంటరీ పాఠశాలలోకి మార్చారు. విద్యార్థులెవరిని వరండాలో, టార్పాలిన్ పట్టల కింద కూర్చోపెట్టొద్దని ఆదేశించారు. 403 సర్వే నెంబర్‌లో 4 ఎకరాల 60 సెంట్లు వుందని అందులో 3 ఎకరాల దాకా తమకు చెందిందని పలువురు కోర్టులను ఆశ్రయించడంతో సమస్య జటిలమైంది. ఇక్కడ 6 గదులు నిర్మాణానికి రూ.72 లక్షలు, ఫేజ్ 2 కింద రూ.63 లక్షలు మొత్తం రూ.1.35 కోట్లు విడుదలైనప్పటికి స్థల సమస్య వలన నిర్మాణాలు చేపట్టలేదని ఉపాధ్యాయులు, గ్రామస్థులు వివరించారు. 1 నుంచి 10 తరగతులకు 7 గదులు మాత్రమే వున్నాయని, 215 మంది బాల బాలికలు ఈ పాఠశాలలో చదువుతున్నారని ఉపాధ్యాయులు వివరించారు.

ఆలయంలో ఎమ్మెల్యే కన్నా పూజలు

సత్తెనపల్లి, ఆగస్టు 22 : పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయన గురువారం సందర్శించారు. ఆశ్రమంలోని వీరబ్రహ్మేంద్ర స్వామివారికి, విశ్వేశ్వర స్వామికి, మల్లికార్జున స్వామికి పూజలు చేశారు. ఆశ్రమంలోని వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో కన్నాకు స్వాగతం పలికి ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాన్ని, స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ ధర్మకర్త చింతాడ లలితాంబ మాతాజీ తదితరులు పాల్గొన్నారు.



సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

తుమ్మకోటలో వ్యక్తిపై దాడి

రెంటచింతల,ఆగస్టు 22 : మండలంలోని తుమ్మకోట గ్రామానికి చెందిన దీపావత్ దత్తాత్రేయ నాయక్‌పై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు వ్యక్తిగత కక్షలతో బుధవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ దాడిలో దత్తాత్రేయ నాయక్ కాళ్లు చేతులకు గాయాలు కావడంతో నరసరావుపేటలోని ఓ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. గురువారం రాత్రి వరకు స్టేషనులో ఎటువంటి ఫిర్యాదు చేయలేదని సమాచారం.

రైతుల సంక్షేమమే సంగం డెయిరీ ధ్యేయం

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

● పాల ఉత్పత్తిదారులకు రూ. 6.04 లక్షల బోనస్ పంపిణీ



పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఆగస్టు 22 : ఎలాంటి లాభా పేక్ష లేకుండా సంగం డెయిరీ రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు గుండపనేని బాషా ఆధ్వర్యంలో గురువారం పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ సంగం డెయిరీ చైర్మన్‌గా పొన్నూరు ఎమ్మెల్యే ధూళ్ళి పాళ్ళ నరేంద్ర బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి డెయిరీని అంచలంచలుగా ఉన్నతస్థాయికి తీసుకు వెళ్ళారన్నారు. ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో స్వచ్ఛ మైన పాలను ప్రజలకు అందించటంలో సంగం డెయిరీ ముందుందన్నారు. వచ్చిన లాభాల్లో రైతులను భాగస్వాములను చేస్తూ రైతులకు ఆదాయన్ని అందిస్తుండటం అభినందనీయమన్నారు. పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ వద్ద ధూళ్ళిపాళ్ళ వీరయ్య చౌదరి పేరుతో ఏర్పాటు చేసిన హాస్పటల్‌లో 50 శాతం సబ్సిడీతో మెరుగైన వైద్యాన్ని అందించటం ప్రశంసనీయమన్నారు. గతంలో పాల ఉత్పత్తి ఈ ప్రాంతంలో అధికంగా ఉండేదని, ఇటీవల పాల ఉత్పత్తి తగ్గుముఖం పట్టిందని, పాల ఉత్పత్తిని పెంచేలా సంగం డెయిరీ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రెండు వందల మంది పాడి రైతులకు రూ 6.04 లక్షల బోనస్‌ను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, స్థానిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు గుండపనేని బాషా, సర్పంచ్ గుడిపూడి రాజు, మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, వైస్ ఎంపీపీ చాంద్ బాషా, టీడీపీ జిల్లా కార్యదర్శి షేక్ ముంతాజ్, సంగం డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీకీ రూ.1.50 లక్షలు విడుదల

రెంటచింతల,ఆగస్టు 22 : మండల కేంద్రం రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా రూ.1.50 లక్షలు విడుదలయ్యాయి. ఏప్రిల్‌లోనే ఈ నిధులు రావాల్సి ఉన్నా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమై తాజాగా విడుదలయ్యాయి. మరో రూ.25 వేలు త్వరలో విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నిధులను పీహెచ్‌సీలో వైద్యుల వాహన అలవెన్సు, ఇతర ఖర్చులతో పాటు అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది. గోలి పీహెచ్‌సీకి పక్కా భవనం లేకపోవడంతో నిధులు విడుదల కాలేదు. ప్రభుత్వం ఈ నిధులను మరింత పెంచాల్సి ఉందని టీడీపీ నేతలు కోరుతున్నారు.

పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా శ్రీధర్

పిడుగురాళ్ల, ఆగస్టు 22: పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పర్వతనేని శ్రీధర్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీధర్ ఇప్పటివరకు పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయంలోనే రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేస్తుండగా ఆయనను కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఫౌండేషన్ నిర్వాహకులు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

సత్తెనపల్లి, ఆగస్టు 22: పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యాకేంద్రం హైస్కూల్లోని విద్యార్థులకు గురువారం వెల్లంకి సాంబశివరావు ఫౌండేషన్ ద్వారా వెల్లంకి సాంబశివరావు స్మారక స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న వారిలో 13 మందికి మొత్తంగా రూ.1 లక్ష స్కాలర్‌షిప్ పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ అరుణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యా కేంద్రం డైరెక్టర్ డీ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి కమిషనర్‌గా అప్పారావు

దాచేపల్లి, ఆగస్టు 22: దాచేపల్లి నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా సత్తెనపల్లి మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వీ. అప్పారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేసిన డీవీఎస్ నారాయణరావు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.

గుండెపోటుతో వివాహిత మృతి

దాచేపల్లి, ఆగస్టు 22: జ్వరంతో వివాహిత మృతి చెందిన ఘటన గురువారం దాచేపల్లి నగర పంచాయతీ, ఇరికేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. నాగెండ్ల నిషిత(23) కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతూ ఉంది. ఈక్రమంలో ఆమె గురువారం గుండెపోటుకు గురై మృతి చెందినట్లుగా స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. నిషిత భర్త కిరణ్‌కుమార్ వ్యవసాయకూలీగా జీవనం సాగిస్తున్నాడు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

మాచర్లటౌన్, ఆగస్టు 22: మాచర్ల మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు బదిలీ కానున్నారు. శుక్రవారం ఇక్కడ నుంచి బదిలీపై గిద్దలూరుకు వెళ్లనున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈయన నంద్యాల నుంచి ఇక్కడకు వచ్చారు. సాధారణ బదిలీలలో భాగంగా ప్రభుత్వం జీవో ప్రకారం బదిలీ అయిన 24 మందిలో వెంకటదాసు ఒకరు. శుక్రవారం గిద్దలూరులో మున్సిపల్ కమిషనర్‌గా వెంకటదాసు బాధ్యతలు చేపట్టనున్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ జియా ఉల్ హక్

బాధితులకు నిత్యావసరాలు అందజేత

మాచర్లటౌన్, ఆగస్టు 22: పట్టణంలోని ఆజాద్ నగర్‌లో నాలుగు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బొనిగె మాణిక్యం పూరిల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న శ్రీరామకృష్ణాసేవాసమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి గురువారం మాణిక్యం కుటుంబానికి నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, నూనె, దుప్పట్లు, టవల్స్, సబ్బులు అందజేశారు. తహసీల్దార్ జియా ఉల్‌హక్ చేతుల మీదుగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐశ్రీనివాసరావు, బీఎస్పీ నేత సైదులు యాదవ్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రెంటచింతల, ఆగస్టు 22: మండలంలోని మిట్టగుడిపాడు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలయ్యాడు. రెంటచింతల నుంచి ద్విచక్ర వాహనంపై మిట్టగుడిపాడు వెళ్తున్న ఉప్పుతోళ్ల సాయిని పొలాల్లో పనిచేసే డోజర్ వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. రెంటచింతల వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం నరసరావుపేటకు తరలించారు.

మద్యం స్వాధీనం

మాచర్లటౌన్, ఆగస్టు 22: పట్టణ శివారులోని జమ్మలమడక వెళ్లే రహదారిలో గల బొంబాయి బ్రిడ్జి వద్ద గురువారం సెబ్ అధికారులు తనిఖీ చేశారు. పరిమళ అబ్రహం అనే వ్యక్తి అక్రమంగా 15 మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు గుర్తించారు. అతని అదుపులోకి తీసుకొని, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్‌సీఐ కిషోర్ తెలిపారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ నఫీజ్‌బాషా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా

మాచర్ల రూరల్, ఆగస్టు 22: గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా హెచ్చరించారు. గురువారం మండలంలోని కంభంపాడులో ఆయన పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. చిన్న చిన్న విషయాలకు గొడవలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే తమకు సమాచారం అందించాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నఫీజ్ బాషా హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వెంట ఎస్ఐ నారాయణ ఉన్నారు.

సేవకు చిరునామా చిరంజీవి

● జనసేన పార్టీ నేత బొర్రా వెంకట అప్పారావు

● వివిధ ప్రాంతాల్లో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి, ఆగస్టు 22 : సినీ జగత్తులోనే కాకుండా, విస్తృత ప్రజా బాహుళ్యంలోనూ మెగాస్టార్ చిరంజీవి సేవకు చిరునామాగా నిలుస్తున్నారని సత్తెనపల్లి జనసేన పార్టీ నియోజక వర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో అభిమానులు సత్తెనపల్లి పట్టణంలో చిరంజీవి 69వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరివర్తన ఆశ్రమ పాఠశాల, మొల్లమాంబ వృద్ధాశ్రమంలో కేక్‌లు కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రంగిశెట్టి సుమన్, ఎన్ నాగేశ్వరరావు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

అచ్చంపేట: మండల కేంద్ర మైన అచ్చంపేటలోని ఆంజనేయుని విగ్రహ సెంటర్‌లో తిరువాయిపాటి ఆంజనేయులు కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో గంధం కోటేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మట్టం వీరభద్రరావు, పోలిశెట్టి చెంచయ్య, అన్నం శ్రీనివాసరావు, నల్లగట్ల సత్యం, తిమ్మిశెట్టి కోటి, ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ స్వామి, అంబడిపూడి సత్యనారాయణ, వాసా శ్రీనివాసరావు, చిమటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: పద్మవిభూషణ్ మెగాస్టార్ కొణిదల చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకొని నియోజక వర్గ జనసేన నేతలు సూదా సాంబశివరావు ఆధ్వర్యంలో పెదకూరపాడులో పలుసేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారికి బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాష్యం నరసయ్య మాట్లాడుతూ చిరంజీవి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతోమందికి మార్గదర్శకంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల వెంకట చలపతిరావు, ఉపాధ్యక్షులు కటకం వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి కందుల లక్ష్మీకాంత్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో కేక్ కట్ చేస్తున్న బొర్రా వెంకట అప్పారావు తదితరులు

సత్తెనపల్లి రూరల్ : మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను మండలంలోని ధూళ్ళిపాళలో జనసేన పార్టీ కార్యాలయంలో, కందులవారిపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావులు పాల్గొని కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బిట్రగుట్ట కృష్ణ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాచర్లరూరల్: మండలంలోని జమ్మలమడకలో చిరంజీవి అభిమానులు గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థులకు పలకలు, పెన్నులు, ప్యాడ్‌లు అందించారు.

గురజాలటౌన్: పట్టణంలోని ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్నదాన కార్యక్రమం, ఆసుపత్రుల్లో పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. అలాగే ఎంఈవో కార్యాలయంలో వున్న దివ్యాంగుల విద్యార్థులకు పండ్లు, కాయలు, పలకలు, నోట్‌బుక్స్ అందజేశారు.

హెల్త్ రికార్డుల పనిలో నిర్లక్ష్యం వద్దు

● ఆరోగ్య శాఖ జిల్లా గణాంక అధికారి, డీపీహెచ్‌ఎన్‌వో

● హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో జిల్లా వైద్యాధికారుల తనిఖీ

పెదకూరపాడు, ఆగస్టు 22 : హెల్త్ రికార్డుల పట్ల నిర్లక్ష్యంగా ఉండ కుండా ఎప్పటికప్పుడు వర్క్ పూర్తి చేసుకోవాలని చేసుకోవాలని ఆరోగ్య శాఖ జిల్లా గణాంక అధికారి నీలకంఠేశ్వరరావు, డీపీహెచ్‌ఎన్‌వో సురేఖలు వెల్‌నెస్ సిబ్బందికి హెల్త్ సిబ్బందికి సూచించారు. మండలంలోని ముస్సాపురంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం వారు సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ రికార్డుల్లో లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు పీహెచ్‌సీకి సంబంధించిన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాల పని తీరును మెరుగు పరుచుకోనేటట్లు సలహాలు, సూచనలను చేశారు. కార్యక్రమంలో డీపీవో పొన్నూరు బాషా, డాక్టర్ వెలుగొండారెడ్డి, ఎంపీహెచ్ ఈవో విజయ కుమార్, పీహెచ్ఎన్ దుర్గ, సూపర్‌వైజర్ దిలీప్ కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పర్వతాలు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వెన్నా సాంబశివారెడ్డి తదితరులు

పర్వతాలు మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, ఆగస్టు 22 : బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తమ్మిశెట్టి పర్వతాలు మృతి పార్టీకి తీరని లోటు అని గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి అన్నారు. గురువారం మధ్యాహ్నం పర్వతాలు మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు పర్వతాలు టీడీపీకి చేసిన సేవల గురించి కొనియాడారు. పర్వతాలు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గొట్టం రమణ, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఓర్సు రాంబాబు, పార్లమెంట్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రవీణ్ సంతాపం .. తమ్మిశెట్టి పర్వతాలు మృతి చెందిన విషయం తెలుసుకున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. మృతుడి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఉత్తమ అధ్యాపకుడికి సత్కారం

అచ్చంపేట, ఆగస్టు 22 : మండల కేంద్ర మైన అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల జంతుశాస్త్ర విభాగంలో జూనియర్ అధ్యాపకుడిగా పని చేస్తున్న దాసరి ప్రభాకర్‌ను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ అధ్యాపకుడిగా దాసరి ప్రభాకర్‌ను 2023 - 24 సంవత్సరానికి ఎంపికయ్యారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో అధ్యాపకుడు ప్రభాకర్‌ను శాలువాతోను, పూల మాలలతోను ఘనంగా సత్కరించారు.



అధ్యాపకుడు దాసరి ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

దోమల నివారణకు ఫాగింగ్

అచ్చంపేట, ఆగస్టు 22 : మండంలోని కోనూరు గ్రామంలో గురువారం సాయంత్రం దోమల నివారణకు చర్యలు చేపట్టి ఫాగింగ్ చేపట్టారు. గ్రామ సర్పంచ్ ఏకుల రాములమ్మ, టీడీపీ అచ్చంపేట మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. గత 27 రోజుల నుంచి కోనూరు గ్రామ పారిశుధ్య చర్యలు చేపడుతూ దోమల నివారణకు అనేక చర్యలు చేపట్టారు. గ్రామంలో విషజ్వరాలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా తదితర వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రతి 45 రోజులకు ఒక సారి ఫాగింగ్ చేస్తామన్నారు.

85,788 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు

● వ్యవసాయ శాఖ జేడీ ఐ మురళి

నరసరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా 85,788 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువుల నిల్వలు ఉన్నాయని వ్యవసాయ శాఖ జేడీ ఐ మురళి గురువారం తెలిపారు. 27795 మెట్రిక్ టన్నుల యూరియా, 6782 మెట్రిక్ టన్నుల డీఏపీ, 47015 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 1362 టన్నుల ఎంవోపీ, 2834 టన్నుల యస్. యస్.పి అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రధాన పంటలైన పత్తి పంట 49,735 హెక్టార్లలో సాగైంది. మిరప, వరి నారు దశలో ఉన్నది. వివిధ సాగు పంటల విస్తీర్ణాన్ని బట్టి ఈ ఖరీఫ్ పంట కాలానికి 99,370 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరమని అంచనావేశామని వివరించారు. ఇందుకు అనుగుణముగా నెలవారీ సరఫరా ప్రణాళికను రూపొందించామన్నారు. ఆగస్టు వరకు 53,392 మెట్రిక్ టన్నులు వివిధ రకాల ఎరువులు అవసరమని అంచనా వేయడం జరిగిందన్నారు. నెలాఖరుకు మిరప, వరి పంటల నాట్లు వేయడం మొదలు అవుతున్నందున, సదరు పంటలకు కూడా కావలసిన ఎరువులు అంచనావేసి, అదనంగా ఆగస్టు, సెప్టెంబరు నెలలకు 10,000 మెట్రిక్ టన్నులు డీఏపీ 8,000 మెట్రిక్ టన్నుల యూరియా ఇతర ఎరువులను కూడా అందుబాటులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ, జిల్లాలో పంటల సరళిని అనుసరించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించి జిల్లాలోని రైతాంగానికి అవసరాలకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రైతుసేవ కేంద్రాలలో 1,867 మెట్రిక్ టన్నులు, కో-ఆపరేటివ్ సొసైటీలలో 2,285 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీ లర్ల వద్ద 36,242 మెట్రిక్ టన్నులు, టోకు వర్తకుల వద్ద 40,642 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సాధారణ సాగు విస్తీర్ణం 2,48,350 హెక్టార్లు కాగా ఇదేస్థాయిలో పంటల సాగు అవుతాయని అంచనా వేశామన్నారు. జిల్లాలోని రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందనవసరం లేదని, ఎరువుల సరఫరాలో ఏదైనా సమస్యలు ఉంటే, సంబంధిత రైతుసేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ అధికారికి గాని, ఏడీఏలకు గాని, జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన కాల్ సెంటర్ నెంబర్ 8331056915కు తెలియజేస్తే సమస్యలు వెంటనే పరిష్కరించడం జరుగుతుందని ఐ. మురళి పేర్కొన్నారు.

ఎరువుల అమ్మకాల్లో వ్యాపారుల దోపిడీ

● ఇబ్బందులు పడుతున్న రైతన్నలు

శావల్యాపురం, ఆగస్టు 22: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతుల అవసరాల బట్టి ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఇష్టానుసారంగా ఎరువుల రేట్లు పెంచి రైతులను దోచుకొంటున్నారు. ఫర్టిలైజర్ షాపులలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ధరలను నియంత్రించాల్సిన వ్యవసాయశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ఫర్టిలైజర్ షాపుల యజమానుల అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. ప్రస్తుతం వరినారుమళ్ళకు ఉపయోగించే సూపర్ బస్తాధర రూ.950 ఉండగా రూ.1000లకు విక్రయిస్తున్నారు. రైతుసేవా కేంద్రాలు, మనగ్రోమోర్, సొసైటీలలో డీఏపీ నిల్వలు లేవని తెలుసుకొన్న ఫర్టిలైజర్ షాపుల యజమానులు డీఏపీ ధరను ఒకేసారి రూ.1400లకు పెంచి విక్రయిస్తున్నారు. ఇటీవల వేల్పూరుకు చెందిన రైతులు బాపట్ల జిల్లా అద్దంకి నుంచి 200 జేజీఎల్ విత్తనాలు తీసుకొచ్చి మొక్క కట్టారు. మొలకశాతం 60:40గా ఉండడంతో దుకాణదారునికి సమాచారం అందించారు. కానీ దుకాణదారుడు డబ్బులు తిరిగి ఇవ్వమని, కావాలంటే విత్తనాలు మార్చుకొని వెళ్లాలని చెప్పడంతో రైతులకు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో బయో ఎరువుల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు అమ్మేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వయనాడ్ బాధితులకు రూ.67వేలు సాయం

చిలకలూరిపేట, ఆగస్టు 22: కేరళలోని వయనాడ్ బాధితులకు అండగా నిలబడేందుకు పట్టణానికి చెందిన న్యాయవాది, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మాదాసు భాను ప్రసాదు నడుంకట్టారు. ఇందులో భాగంగా ఆయన తన వాట్సప్ గ్రూపులో బాధితులకు సాయంగా విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఆయన తన వంతుగా రూ.2వేలతో విరాళాన్ని ఇచ్చి ఇతరులకు పిలునిచ్చారు. దీంతో ఈ నెల ప్రారంభంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పలువురు పాలు పంచుకున్నారు. మొత్తం రూ.67,217 విరాళంగా సమకూరింది. ఈ మొత్తాన్ని రెండు డీడీల ద్వారా కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడను కలిసిన డీఎస్పీ



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు మొక్కను అందజేస్తున్న డీఎస్పీ కే నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22: పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ కే నాగేశ్వరరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కే నాగేశ్వరరావును సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసిశారు. శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు ఉన్నారు.

వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్ చంద్రబోస్



వినుకొండ, ఆగస్టు 22: వినుకొండ మున్సిపల్ కమీషనర్‌గా యం.సుభాష్ చంద్రబోస్‌ను ప్రభుత్వం గురువారం నియమించింది. సార్వత్రిక ఎన్నికల్లో బాగంగా వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన తోట కృష్ణవేణి పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన కొమ్మాలపాటి



మంత్రి నారా లోకేశ్‌తో కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 : మంత్రి నారా లోకేష్‌ను పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఉండవల్లి లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

పల్నాడు జిల్లాలో రాజకీయ పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి భేటీలో చర్చించారు. ప్రతిపాదించిన అంశాలపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని కొమ్మాలపాటి శ్రీధర్ వెల్లడించారు.

జిల్లా స్థాయి ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

● విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22: జిల్లా స్థాయి ఉపాధ్యాయ పురస్కారం-2024కు అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఏటా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన సందర్భంగా సెప్టెంబరు 5న విద్యాశాఖలో ఉత్తమ ప్రదర్శన చేసిన ఉపాధ్యాయులను జిల్లా స్థాయిలో సన్మానించడం జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక ఏపీఆర్ఈఐఎస్, ఏపీఎస్ఈఆర్ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్‌లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచే స్తున్న ఉపాధ్యాయులుల దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుదారునకు కనీసం 15 సంవత్సరాలు బోధనా అనుభవం కలిగిఉండాలన్నారు. దరఖాస్తులను ఆగస్టు 25వ తేదీ లోపు సంబంధిత మండల విద్యాశాఖాధికారుల ద్వారా ఉప విద్యాశాఖాధికారులకు అందజేయాలన్నారు.



రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ జోసెఫ్ కుమార్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

● డ్వామా పీడీ జోసెఫ్ కుమార్

రొంపిచర్ల, ఆగస్టు 22: మొక్కలను ప్రతి ఒక్కరూ నాటాలని డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ గురువారం తెలిపారు. మండల కేంద్రమైన రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వాతావరణ కాలుష్యం పెరగకుండా ఉంటుందన్నారు. వర్షాలు సకాలంలో కురుస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, ఎంపీడీవో మాధ్యూబాబు, మాజీ ఎంపీపీ మందలపు రామారావు, ఏపీవో ప్రసాదు, ఏపీడీ సుధాకర్, పడాల చక్రారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం.. విద్యార్థులకు ఇక్కట్లు

శావల్యాపురం, ఆగస్టు 22: విద్యార్థులకు ప్రభుత్వం మంజూరుచేసే ఉపకార వేతనాలు పొందేందుకు ఇన్‌కం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకొంటే నెలలు గడుస్తున్నా సర్టిఫికెట్లను మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామానికి చెందిన ఓ యువతి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కోసం 20రోజుల క్రితం మతుకుమల్లి సచివాలయంలో దరఖాస్తు చేసుకొంది. వీఆర్వో రూ.300 లంచం తీసుకొని దరఖాస్తును తహసీల్దార్ కార్యాలయంలో అందజేశానని, వారితో మాట్లాడుకొని పనిచేయించుకోవాలని చెప్పాడు. అంతలో ఉన్నతాధికారులు వీఆర్వోని విధుల నుంచి తప్పించి మరో వీఆర్వోని నియమించారు. దాంతో దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్ళి అధికారులను సంప్రదిస్తే ఈడబ్ల్యూఎస్ దరఖాస్తు తమవద్దకు రాలేదని, కొత్త వీఆర్వోకి చెప్పి వెంటనే చేయిస్తామన్నారు. వారంరోజులు గడుస్తున్నా ఇంతవరకు ఎటువంటి ఆచూకీ లేకపోవడంతో ఉపకార వేతనాలు అందుతాయో, లేదోనని దరకాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇలా మండలంలోని ఎంతోమంది విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి నెలకొంది. గతంలో ఇన్‌కం సర్టిఫికెట్‌కు దరకాస్తు చేసుకోవాలంటే నోటరీతో పనిలేదు. కానీ ఇప్పుడు నోటరీ ఉంటేనే ఇన్‌కంసర్టిఫికెట్ ఇస్తామని అధికారులు చెబుతుండడంతో దరకాస్తుదారులు వినుకొండకు వెళ్ళి నోటరీ చేయించాల్సి వస్తోంది. అంతేకాక ఖరీఫ్‌సీజన్ ప్రారంభం కావడంతో కొందరు రైతులు 1బీ, అడంగల్‌ల కోసం మీసేవలకు వెళితే ఖాతాకు తహసీల్దార్ డిజిటల్ సిగ్నేచర్ లేదని, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్ళి చేయించుకోవాలని చెప్పడంతో రైతులు కూడా తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగలేక తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చదువు మానేసిన వారికి దూర విద్య కోర్సులు

● సార్వత్రిక విద్యా పీఠం రాష్ట్ర కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ

రొంపిచర్ల, ఆగస్టు 22: చదువు మధ్యలో మానివేసిన వారికి, కొత్తగా చదువుకునే వారికి సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చదువుకునే అవకాశం కల్పిస్తున్నట్టు సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర కో-ఆర్డినేటర్ అక్బర్ అలీ గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి గోడ పత్రికను ఆవిష్కరించారు. వివిధ కోర్సులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. 10వ తరగతి తప్పిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను అభ్యసించవచ్చన్నారు. 10వ తరగతికి 14 సంవత్సరాలు, ఇంటర్‌కు 15సంవత్సరాలు కనీస వయస్సు అని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభ మైనట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యాచార ఘటనపై సీపీఐ నాయకుల నిరసన

రొంపిచర్ల, ఆగస్టు 22: మండల కేంద్రమైన రొంపిచర్లలో సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మాట్లాడుతూ కలకత్తాలో శిక్షణలో ఉన్న వైద్యురాలిని లైంగికంగా వేధించి హత్య చేయటం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ దీనికి బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శేషంరాజు, తిమ్మరాజు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 85,788 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు

● వ్యవసాయ శాఖ జేడీ ఐ మురళి

నరసరావుపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా 85,788 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువుల నిల్వలు ఉన్నాయని వ్యవసాయ శాఖ జేడీ ఐ మురళి గురువారం తెలిపారు. 27795 మెట్రిక్ టన్నుల యూరియా, 6782 మెట్రిక్ టన్నుల డీఏపీ, 47015 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 1362 టన్నుల ఎంవోపీ, 2834 టన్నుల యస్.యస్.పి అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రధాన పంటలైన పత్తి పంట 49,735 హెక్టార్లలో సాగైంది. మిరప, వరి నారు దశలో ఉన్నది. వివిధ సాగు పంటల విస్తీర్ణాన్ని బట్టి ఈ ఖరీఫ్ పంట కాలానికి 99,370 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరమని అంచనావేశామని వివరించారు. ఇందుకు అనుగుణముగా నెలవారీ సరఫరా ప్రణాళికను రూపొందించామన్నారు. ఆగస్టు వరకు 53,392 మెట్రిక్ టన్నులు వివిధ రకాల ఎరువులు అవసరమని అంచనా వేయడం జరిగిందన్నారు. నెలాఖరుకు మిరప, వరి పంటల నాట్లు వేయడం మొదలు అవుతున్నందున, సదరు పంటలకు కూడా కావలసిన ఎరువులు అంచనావేసి, అదనంగా ఆగస్టు, సెప్టెంబరు నెలలకు 10,000 మెట్రిక్ టన్నులు డీఏపీ 8,000 మెట్రిక్ టన్నుల యూరియా ఇతర ఎరువులను కూడా అందుబాటులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ, జిల్లాలో పంటల సరళిని అనుసరించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించి జిల్లాలోని రైతాంగానికి అవసరాలకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రైతుసేవ కేంద్రాలలో 1,867 మెట్రిక్ టన్నులు, కో-ఆపరేటివ్ సొసైటీలలో 2,285 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 36,242 మెట్రిక్ టన్నులు, టోకు వర్తకుల వద్ద 40,642 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సాధారణ సాగు విస్తీర్ణం 2,48,350 హెక్టార్లు కాగా ఇదేస్థాయిలో పంటల సాగు అవుతాయని అంచనా వేశామన్నారు. జిల్లాలోని రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందనవసరం లేదని, ఎరువుల సరఫరాలో ఏదైనా సమస్యలు ఉంటే, సంబంధిత రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ అధికారికి గాని, ఏడీఏలకు గాని, జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన కాల్ సెంటర్ నెంబర్ 8331056915 కు తెలియజేస్తే సదరు సమస్యలు వెంటనే పరిష్కరించడం జరుగుతుందని ఐ. మురళి పేర్కొన్నారు.

ఎరువుల అమ్మకాల్లో వ్యాపారుల దోపిడీ

ఇబ్బందులు పడుతున్న రైతన్నలు

శావల్యాపురం, ఆగస్టు 22: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతుల అవసరాల బట్టి ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఇష్టానుసారంగా ఎరువుల రేట్లు పెంచి రైతులను దోచుకొంటున్నారు. ఫర్టిలైజర్ షాపులలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ధరలను నియంత్రించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో ఫర్టిలైజర్ షాపుల యజమానుల అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. ప్రస్తుతం వరినారుమళ్ళకు ఉపయోగించే సూపర్ బస్తాధర రూ.950 ఉండగా రూ.1000లకు విక్రయిస్తున్నారు. రైతుసేవా కేంద్రాలు, మనగ్రోమోర్, సొసైటీలలో డీఏపీ నిల్వలు లేవని తెలుసుకొన్న ఫర్టిలైజర్ షాపుల యజమానులు డీఏపీ ధరను ఒకేసారి రూ.1400లకు పెంచి విక్రయిస్తున్నారు. ఇటీవల వేల్పూరుకు చెందిన రైతులు బాపట్ల జిల్లా అద్దంకి నుంచి 200 జేజీఎల్ విత్తనాలు తీసుకొచ్చి మొక్క కట్టారు. మొలకశాతం 60:40గా ఉండడంతో దుకాణదారునికి సమాచారం అందించారు. కానీ దుకాణదారుడు డబ్బులు తిరిగి ఇవ్వమని, కావాలంటే విత్తనాలు మార్చుకొని వెళ్లాలని చెప్పడంతో రైతులకు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా మండలంలోని ఫర్టిలైజర్ షాపుల్లో బయో ఎరువుల అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. గుర్తింపు లేని సంస్థల నుంచి బయోఎరువులను తక్కువ ధరలకు కొనుగోలు చేసి రైతులకు అధిక ధరలకు అమ్ముతున్నారు. వ్యవసాయాధికారులు ప్రతినెలా శాంపిళ్లు సేకరించి ఏమీలేనట్లుగా నివేదికలు సమర్పించడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు అమ్మేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా నవగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం



నవగ్రహాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

కొచ్చెర్ల (ఈపూరు) ఆగస్టు 22: మండలంలోని కొచ్చెర్లలో గంగా, పార్వతి సమేత రామలింగేశ్వరుని ఆలయం గురువారం నవగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. నవగ్రహాలతో పాటు విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యేశ్వరుడు, అయ్యప్ప, స్వర్ణ కాల భైరవుడు, నాగేంద్రుడు, చండీశ్వరుల విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

గుర్రపునాయుడుపాలెంలో...

నూజెండ్ల, ఆగస్టు 22: మండలంలోని గుర్రపునాయుడుపాలెంలో నూతనంగా 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన శ్రీ మహాగణపతి, పోలేరమ్మ, సీతాలంబ (నాభిశిల), సీతారామ చంద్రస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ మహోత్సవాల్లో హోమాలు, యంత్ర ప్రతిష్ఠ, విమాన శిఖర కుంబాభిషేకం, మహాదాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు పులుపుల వెంకట ఫణి కుమార్‌శర్మ ఆధ్వర్యంలో, కొండవీటి రాఘవాచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, గంగినేని రామయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

వినుకొండ టౌన్, ఆగస్టు 22: గొంట్ల వెంకాయమ్మ, రంగయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దకంచర్ల ఎంపీపీ పాఠశాలలోని 65 మంది విద్యార్థినీ, విద్యార్థులకు గురువారం పుస్తకాలు పెన్నుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమలారామ్, వెంకటేశ్వర్లు, మధుబాబు, ప్రధాన ఉపాధ్యాయులు ఖాసింబి, ఆత్మకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రత్యేక సాధన చేయించాలి: ఎంఈవో

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 22: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులతో ఉదయం చెప్పిన పాఠ్యాంశాలను సాయంత్రం వేళల్లో ప్రత్యేక సాధన చేయించి వారికి గుర్తుండిపోయేలా చూడాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు తెలిపారు. మండలంలోని కారుమంచిలోని బీసీ, హెచ్‌సీ ప్రాథమిక పాఠశాలలను ఆయన గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధన ప్రణాళికలు, మధ్యాహ్న భోజనం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులను విద్యతోపాటు, క్రీడలలో కూడా ప్రావీణ్యాన్ని పొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. హెచ్ఎంలు మాదాల రామకోటేశ్వరరావు, శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలకత్తా ఘటనపై న్యాయవాదుల నిరసన ర్యాలీ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 22: కలకత్తా ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో ఈ నెల 9న చోటు చేసుకున్న మెడికల్ పీజీ విద్యార్థినిపై అత్యాచారాన్ని నిరసిస్తూ స్థానిక న్యాయవాదులు గురువారం ర్యాలీ నిర్వహించారు. న్యాయవాద సంఘ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం మహాత్మా గాంధీ విగ్రహం ఆర్డీవో ఆఫీస్ వరకు ర్యాలీ కొనసాగింది. ఆర్డీవో సరోజినికి మెమోరాండం సమర్పించారు ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ ఈటువంటి చర్యలు పురావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ ఉపాధ్యక్షుడు అమూల్య కార్యదర్శి అబ్బూరి ఏడుకొండలు పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు

రెండో పట్టణ సీఐగా హైమారావు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 22: రెండో పట్టణ సీఐగా ఎం.హైమరావును నియమిస్తూ సౌత్ సెంట్రల్ జోన్ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు గుంటూరు రేంజ్‌లోని 13మంది సీఐలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎం.హైమారావు నరసరావుపేట రెండో పట్టణానికి బదిలీ అయ్యారు

కొచ్చేర్ల తండాలో వాటర్ ప్లాంటు ప్రారంభం

ఈపూరు, ఆగస్టు 22: మండలంలోని కొచ్చేర్ల తండాలో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య ఐనాల కోటేశ్వరరావు, జె.చంద్రశేఖర్, గోలి వెంకటేశ్వర్లు,జాగర్లమూడి రామారావు, టి.రామకోటేశ్వరరావు, నర్రా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గాటితండాలో సీతారాములవారి విగ్రహ ప్రతిష్ఠ

బొల్లాపల్లి, ఆగస్టు 22: మండలంలోని గాటితండాలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠా కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీమంత్రి మక్కెన మల్లిఖార్జునరావులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆంజనేయులుకు, మాజీ ఎమ్మెల్యేకు మక్కెనకు ఘన స్వాగతం పలికారు.

నేడు జాతీయ ఉపాధి హామీ పథకంపై గ్రామసభలు

శావల్యాపురం, ఆగస్టు 22: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని 15గ్రామపంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి. సీతారామయ్య గురువారం తెలిపారు. ప్రతి గ్రామసభకు ప్రత్యేకాధికారిని నియమించామన్నారు.

సార్వత్రిక వ్యాధినిరోధక టీకాలపై శిక్షణ

నరసరావుపేట రూరల్, ఆగస్టు 22: సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలపై ఈ నెల 21 22 తేదీల్లో పల్నాడు జిల్లాలోని వైద్యాధికారులు పర్యవేక్షకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్విలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

స్వయం కృషితో ఎదిగిన నటుడు చిరంజీవి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిరంజీవి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, రాజా రమేష్

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 22: స్వయం కృషితో దేశ చలనచిత్ర పరిశ్రమలోనే మెగాస్టార్‌గా ఎదిగిన నటుడు చిరంజీవి నిజ జీవితంలో కూడా ప్రజల హృదయాల్లో విజేతగా నిలిచారని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. ఒక వైపు నటన, మరో వైపు సేవా కార్యక్రమాలతో ప్రేక్షకులకు వినోదం పంచటంతో పాటు అదే ప్రజలకు ఎప్పుడు అవసరమైనా నేనున్నానంటూ నిలబడ్డారని, రాజకీయ రంగంలో కూడా తనదైన ముద్ర వేశారన్నారు. గురువారం సినీ నటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా చిలకలూరిపేట వీరముష్టి కాలనీలో స్థానిక టీడీపీ నాయకులు చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగుదేశం, జనసేన, చిరంజీవి అభిమానులతో కలసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

చిలకలూరిపేట, ఆగస్టు 22: మెగా స్టార్ చిరంజీవి 69వ జన్మదిన వేడుకలు గురువారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ వేడుకల్లో పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. కాపు సంక్షేమ సంఘం నియోజక వర్గ అధ్యక్షుడు ఉయ్యూరి నరసింహారావు ఆధ్వర్యంలో వృద్ధులకు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి ఆధ్వర్యంలో బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో షైలా గణేష్, ఎం.రాజేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక కాపు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు షేక్ అల్లీమియా, ఎం రాధాకృష్ణ, సినీ హీరో శివ పాల్గొని కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో గోవిందు శంకర్ శ్రీనివాస్, తోట లక్ష్మీనారాయణ, సీహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు. జనసేన నాయకులు పెంటేల బాలాజీ కార్యాలయంలో మెగా అభిమానుల మధ్య చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రక్తదానం,

నరసరావుపేటలో...

నరసరావుపేట టౌన్, ఆగస్టు 22 : నరసరావుపేట పట్టణంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురవారం చిరంజీవి యువత, జనసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లిటిల్ హార్ట్స్ అనాధ శరణాలయంలో పుట్టినరోజు కేక్ కట్ చేయించి పంపిణీ చేశారు. అనంతరం అనాధ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి యువత అధ్యక్షుడు అద్దేపల్లి ఆనంద్‌బాబు, ఆర్కే యాదవ్, కృష్ణంశెట్టి గోవిందు, చెన్నుపల్లి సాంబ, గుప్తా శ్రీకాంత్, బోనం జయరామ్, గోపు మల్లి, వీర మహిళలు, మిర్యాల వెంకట సుబ్బమ్మ, జడ శ్రావణి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ, ఆగస్టు 22: జనసేన పార్టీ వినుకొండ సమన్వయకర్త కొణిజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బాగంగా వినుకొండ ప్రభుత్వం వైద్యశాల్లోని బాలింతలకు, గర్భవతులకు, రోగులకు పండ్లు, రొట్టెలు వైద్యాధికారి డాక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వైద్యశాల ఆవరణలో భారీ కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన జనసేన పార్టీకి చెందిన దివ్యాంగుడికి రూ.5000 ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో బాగంగా పారెళ్ల అభిమన్యం, ఆడపాల అనీల్, కామిశెట్టి కిశోర్, గండికోట మణికంఠ. హనుమాన్ నాయక్, యాదాల వెంకటేష్, తాతావంశీ, రామకృష్ణ, అశోక్, సోమిశెట్టి లక్ష్మణ్‌రావు, తిరుమల, అనీల్, చిరంజీవి, నాగేశ్వరరావు , చిరంజీవి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి

● డీఎస్పీతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



ప్రత్తిపాటికి మొక్కను అందజేస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 22: ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును మర్యాద పూర్వకంగా కలసిన నూతన డీఎస్పీ నాగేశ్వరరావుకు ప్రజల ఆశలు, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని, కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని, సంఘ విద్రోహ శక్తులు, దొంగలు, గంజాయి మాఫియాతో కఠినంగా వ్యవహరించి ఉక్కుపాదం మోపాలని కొత్తగా నియమితులైన డీఎస్పీ నాగేశ్వరావుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. గురువారం ప్రత్తిపాటిని డీఎస్పీ నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి డీఎస్పీని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు సేవే ఆర్టీసీ లక్ష్యం కావాలి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఆగస్టు 22: ప్రజలకు సేవే లక్ష్యంగా ఆర్టీసీ పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట ఆర్టీసీ డిపో నుంచి రెండు నూతన బస్సు సర్వీసులను గురువారం ప్రత్తిపాటి ప్రారంభించారు. చిలకలూరిపేట నుంచి విజయవాడ, చిలకలూరిపేట నుంచి హైదరాబాద్‌కు ఈ సర్వీసులు ఏర్పాటు చేశారు. బస్టాండ్ ఆవరణలో జెండా ఊపి బస్సును ప్రత్తిపాటి ప్రారంభించారు. అనంతరం బస్సులో కొంత దూరం ప్రయాణించి ప్రయాణికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా డొక్కు బస్సులు, వరుస ప్రమాదాలు, వేళాపాళా లేని సర్వీసులతో పూర్తిగా గాడితప్పిన ఆర్టీసీని చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందుకోసమే వందలాది కొత్త బస్సులు కూడా కొనుగోలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుమతించారని, భవిష్యత్తులో మరిన్ని వాహనాలు కూడా వాటికి జత చేరుస్తామని తెలిపారు. ఐదు సంవత్సరాలు పాలించి ఆర్టీసీలో కొత్త బస్సును కొనకుండా సంస్థను జగన్‌రెడ్డి సర్వనాశనం చేశారని ప్రత్తిపాటి విమర్శించారు. అదే సమయంలో ప్రజలకు అవసరమైన రద్దీమార్గాల్లో కూడా సర్వీసులు రద్దుచేసి అవస్థలకు గురి చేశారన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు కొత్త సర్వీసులు ప్రవేశ పెడుతున్నామన్నారు. భవిష్యత్‌లో అవసరాల మేరకు మరికొన్ని కొత్త సర్వీసులు కూడా తీసుకు వస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.

రహదారి ముఖ ద్వారానికి శంకుస్థాపన

నాదెండ్ల, ఆగస్టు 22: మండలంలోని గణపవరంలోని ప్రధాన రహదారి ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేసేందుకు గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్ళే ప్రధాన రహదారికి ప్రత్తిపాటి పుల్లారావు రహదారి పేరుతో తీర్మానం చేశారు. రూ.10.60 లక్షల అంచనాతో ఈ ముఖద్వారాన్ని నిర్మిస్తున్నారు. 20అడుగుల ఎత్తు, 52 అడుగుల వెడల్పు కలిగిన ముఖద్వారం నిర్మాణాన్ని గ్రామస్థులు, దాతలు విరాళాలను అందజేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తేళ్ళ సుబ్బారావు, కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీను, పెంటాల శేషయ్య, జంపని శ్రీనివాసరావు, సత్యనారాయణ, గాలి బుచ్చయ్య, కాట్రు కృష్ణారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో మల్బరీ సాగుతో అధిక ఆదాయం

● పట్టు పరిశ్రమల శాఖ ఏడీ బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా పట్టు పరిశ్రమల అసిస్టెంట్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం

ఉన్నవ (యడ్లపాడు), ఆగస్టు 22: సమగ్ర యాజమాన్య పద్ధతులతోపాటు ఆధునికతను జోడించి మల్బరీ సాగుచేస్తే అధిక ఆదాయం పొందవచ్చని పట్టు పరిశ్రమల శాఖ పల్నాడు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో మల్బరీ తోటలు.. యాజమాన్య పద్ధతులు, పట్టుపురుగుల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మల్బరీ తోటల సాగుతో నెలకు రూ.40వేల నుంచి రూ.50వేలు ఆదాయాన్ని పొందేందుకు వీలుంటుందన్నారు. సరైన సాగు పద్ధతులు అవలంభించకపోవడం వలన నష్టాలు వస్తున్నాయన్నారు. అతి తక్కువ ఖర్చుతో మల్బరీ తోటలను ఎలా సాగుచేయవచ్చు, పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే పట్టు పురుగులు గుడ్డు దశ నుంచి గూడు అల్లే వరకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆధునిక సాంకేతికతను ఎలా జోడించాలి అన్న విషయాలపై అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి కుర్రా వేణు కార్యాలయంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మందిరంలో ప్రతిష్ఠించిన దేవతా మూర్తుల విగ్రహాలు

వైభవంగా శ్రీరామ మందిరంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ

నాదెండ్ల, ఆగస్టు 22: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో శ్రీరామ మందిరం పునఃప్రతిష్ఠా కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. సుమారు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ మందిరంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ శిఖర పునఃప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి, సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మీశ్వరరెడ్డి, ఎం.జగన్నాథరెడ్డి, మేకల ఆంజనేయరెడ్డి, యన్నం రవీంద్రారెడ్డి, శివారెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

వయనాడ్ బాధితులకు రూ.67వేలు సాయం

చిలకలూరిపేట, ఆగస్టు 22: కేరళలోని వయనాడ్ బాధితులకు అండగా నిలబడేందుకు పట్టణానికి చెందిన న్యాయవాది, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మాదాసు భాను ప్రసాదు నడుంకట్టారు. ఇందులో భాగంగా ఆయన తన వాట్సప్ గ్రూపులో బాధితులకు సాయంగా విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఆయన తన వంతుగా రూ.2వేలతో విరాళాన్ని ఇచ్చి ఇతరులకు పిలునిచ్చారు. దీంతో ఈ నెల ప్రారంభంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పలువురు పాలు పంచుకున్నారు. మొత్తం రూ.67,217 విరాళంగా సమకూరింది. ఈ మొత్తాన్ని రెండు డీడీల ద్వారా కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపారు. విరాళాలు ఇచ్చిన వారి పేర్లను కూడా ఆ డీడీలతో పాటు కేరళ ప్రభుత్వానికి పంపారు.

కాపునాడు సేవా సమితి రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు నియామకం

చిలకలూరిపేట, ఆగస్టు 22: రాష్ట్ర కాపు నాడు సేవా సమితి కార్యదర్శిగా పట్టణానికి చెందిన వట్టెం శ్రీనివాసరావు గురువారం నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగమల్లేశ్వరరావు నియామకపత్రం జారీచేశారు. స్థానిక కాపునాడు కార్యాలయంలో గురువారం సేవా సమితి సభ్యులు గోవిందు శంకర్ శ్రీనివాస్, చిన కాపు సీహెచ్ రామారావు తదితరులు ఈ నియమాక పత్రాన్ని వట్టెం శ్రీనివాసరావుకు అందజేశారు.